సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ అందజేత



ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన రాము కొన్ని నెలలుగా భుజం నొప్పుల కు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్నాడు. వారి ఆర్థిక పరిస్థితులు బాగలేక కుటుంబ సభ్యులు ఇటీవల ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని సహాయం కోసం కలిశారు. రాము భుజం నొప్పుల సమస్య పరిష్కారం కోసం చేయబోయే ఆపరేషన్ ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ఎమ్మెల్యే వారి చేత దరఖాస్తు చేయించారు. రాము ఆపరేషన్ కోసం మంజూరైన లక్ష రూపాయల ఎల్ఓసీని బాధితుడి భార్య లక్ష్మీకి ఎమ్మెల్యే శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని అన్నారు.



గడ్డిఅన్నారంలో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి, పక్కన మాజీ కార్పొరేటర్ ప్రభాకర్‌రెడ్డి

రూ.2.20కోట్లతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల స్థానిక డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. దాదాపు రూ.2.20కోట్లతో నిర్మించిన 12 అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మున్సిపాలిటీ టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్ గండి కృష్ణయాదవ్, చీకోటి శ్రవణ్, గొట్టిపర్తి సుధీర్‌గౌడ్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

హయత్‌నగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని వస్పరినగర్ కాలనీలో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ కళ్లెం నవజీవర్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారులో ఉన్న కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. శివారు కాలనీల సంక్షేమ సంఘం నాయకుల ద్వారా సమస్యలను తెలుసుకుని జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకుపోయి వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, నర్సింహ, శ్రీనివాస్, జంగయ్య, రాములు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి సహకరించండి

కొత్తపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి విన్నవించారు. శనివారం ఆయన జలమండలి ప్రధాన కార్యాలయంలో అశోక్‌రెడ్డికి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశంకర్‌కాలనీ, భరత్‌నగర్-2, శివగంగకాలనీ, మారుతీనగర్, మోహన్‌నగర్, నాగేశ్వర్‌నగర్‌కాలనీల్లో పాత డ్రైనేజీ పైప్‌లైన్ల కారణంగా తరచూ డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు మంచి రాజేష్, అశ్విన్‌సింగ్, సుందర్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

హయత్‌నగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హయత్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా రూ.8700 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కింద రావాల్సి ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు సాయి, కార్యదర్శి వంశీ, సభ్యులు వేణు, మహేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆకట్టుకున్న చిన్నారుల డ్యాన్స్

మీర్‌పేట్ 'నాగార్జున'లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

సరూర్‌నగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్‌లోని నాగార్జున మాంటిస్సోరి ఐఐటీ ఒలింపియాడ్ స్కూల్‌లో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో స్కూల్‌లో చేరిన విద్యార్థులు, పాత విద్యార్థులతో కలిసి నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా కొత్త, పాత విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. తమ ఆటపాటలతో అలరించారు. నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ జి.విఠల్‌రెడ్డి ఈ వేడుకలను ప్రారంభించి మాట్లాడుతూ కొత్తగా స్కూల్‌లో చేరిన విద్యార్థులు ఇక్కడి వాతావరణానికి, పాత విద్యార్థులతో కలిసిమెలిసి ఉండడానికి ఫ్రెషర్స్ డే ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్, ఇన్‌చార్జిలు దుర్గ, రాధిక, సంధ్య, ప్రశాంతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హస్తినాపురం సెంట్రల్‌కాలనీలోని స్కూల్‌లో..

చంపాపేట : డివిజన్‌లోని హస్తినాపురం సెంట్రల్‌కాలనీలోని నాగార్జున మాంటిస్సోరి, ఐఐటీ కాన్సెప్ట్ స్కూల్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాత, కొత్త విద్యార్థులు కలిసిమెలిసి ఉత్సాహంగా, ఉల్లాసంగా నృత్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని అలరించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా నాగార్జున విద్యాసంస్థల చైర్‌పర్సన్ గుమ్మకొండ రజిని విఠల్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులు తేలికగా ఇతర విద్యార్థులతో కలిసి పోయి కొత్త వాతావరణానికి అలవాటు పడటానికి ఈ వేడుకలు ఎంతో ఉపయోగ పడుతాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, ఇన్‌చార్జీలు ఉషాశ్రీ, సలోమి, పష్పలత, దివ్యజ్యోతి, సవిత, అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

రైతుల వద్ద అధిక కమీషన్ వసూలు చేస్తే చర్యలు

- మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

ఎల్బీనగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద అధిక కమీషన్ వసూలు చేస్తే చర్యలు తప్పవని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్‌లో శనివారం కమీషన్ ఏజెంట్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే తమకు ముఖ్యమన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఇతరుల లైసెన్స్‌లతో వ్యాపారాలు చేస్తున్న బినామీ ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.మార్కెట్ వెలుపల రైతుల ముసుగులో నడుస్తున్న దళారీ వ్యవస్థను కూడా అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ ఉప సంచాలకుడు ప్రసాద్‌రావు, ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, వైస్ చైర్మన్ భాస్కరాచారి, సభ్యులు మచ్చేందర్‌రెడ్డి, లక్ష్మీ, గణేష్‌నాయక్, గోవర్ధన్‌రెడ్డి, అంజయ్య, ఇబ్రహీం, జైపాల్‌రెడ్డి, బండి మధుసూదన్‌రావు, రఘుపతిరెడ్డి, మార్కెట్ కార్యదర్శి వహీద్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జీరో ఎన్‌బీడబ్ల్యూ రికార్డు సాధించిన రాచకొండ కమిషనరేట్

- 40 రోజుల్లో 2024 ఎన్‌బీడబ్ల్యూ కేసులు పరిష్కారం
- నిందితులను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు
- సిబ్బందిని అభినందించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు



ప్రత్యేక బృందాలకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): నేర చరిత్ర కలిగిన వారు సమాజంలో తిరగడం వల్ల ప్రజలకు, ఆయా కేసుల్లో సాక్షులకు ఇబ్బంది కరంగా మారుతోందని, ఈ సమస్యపై దృష్టిపెట్టి పెండింగ్‌లో ఉన్న అన్ని నాన్‌బెయిలబుల్ వారెంట్‌ల కేసులు పరిష్కారం చేశామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. నాగోల్‌లోని ఓ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీ మాట్లాడుతూ న్యాయస్థానంలో కేసుల విచారణ సందర్భంలో నిందితులు ఉద్దేశపూర్వకంగా హాజరు కాకుండా తప్పించుకుంటున్నారని, ఈ కారణంగా కేసుల విచారణలో జాప్యం జరుగుతోందన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో 50,249 కేసులకు సంబంధించి కోర్టుల్లో విచారణ జరుగుతోందన్నారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా, కేసు విచారణను జాప్యం చేస్తుండడంతో న్యాయస్థానాలు వారిపై నాన్‌బెయిలబుల్ వారెంట్లు(ఎన్‌బీడబ్ల్యూ)లు జారీ చేశాయన్నారు. ఈఏడాది ప్రారంభంలో కమిషనరేట్ పరిధిలో 1088 ఎన్‌బీడబ్ల్యూలు పెండింగ్‌లో ఉండగా, ఏప్రిల్‌కు వీటి సంఖ్య 2024కు చేరిందన్నారు. దీనిపై దృష్టి సారించి ఈ కేసులను లాంగ్ పెండింగ్, గ్రేవ్, నాన్‌గ్రేవ్, కమిషనరేట్ పరిధి, ట్రై కమిషనరేట్ పరిధి, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు విభజించి కార్యాచరణ ప్రారంభించామన్నారు. కేసులను పరిష్కరించేందుకు ఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లతో కూడిన 14 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక బృందాలకు అవసరమైన వాహనాలు ఇతర అలవెన్స్‌లు అందించి ఇతర రాష్ట్రాలకు పంపామన్నారు. ప్రత్యేక బృందాలకు చెందిన సిబ్బందిని ఏపీ, మహారాష్ట్ర, రాజస్థాన్‌లకు పంపి నిందితులను పట్టుకొని కోర్టులో హాజరు పరిచామన్నారు. రికార్డు స్థాయిలో 40 రోజుల వ్యవధిలో 2024 ఎన్‌బీడబ్ల్యూ కేసులను పరిష్కరించామన్నారు. తప్పించుకు తిరుగుతున్న మరో 823 కేసుల్లో నిందితుల ఆచూకీ తెలుసుకునేందుకు ప్రకటనలు జారీచేశామన్నారు. జూలై చివరికి 2847 కేసులకు సంబంధించి దర్యాప్తు పూర్తిచేసి, జీరో ఎన్‌బీడబ్ల్యూ సాధించిన కమిషనరేట్‌గా చరిత్ర సృష్టించామన్నారు. నాన్‌బెయిలబుల్ వారెంట్‌లు జారీ అయినా పరారీలో ఉన్న నిందితులకు పూచికత్తు ఇచ్చిన వారికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. పరారీలో ఉన్న నేరగాళ్ల, షూరిటీ ఇచ్చిన వారి ఆస్తులు జప్తు చేసేందుకు న్యాయ ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. ఎన్‌బీడబ్ల్యూ కేసులను పరిష్కరించడం ద్వారా న్యాయస్థానాల్లో కేసుల విచారణ వేగం పుంజుకుంటుందని, కేసుల్లో నిందితులకు శిక్షలు పడతాయన్నారు.

నేరగాళ్లు సమాజంలో తిరగకుండా చేయడం ద్వారా ప్రజలు, ఆయా కేసుల్లో సాక్షులు ఎలాంటి ఆందోళన లేకుండా ఉంటారన్నారు. అంతేకాకుండా ఎన్‌బీడబ్ల్యూ పెండింగ్‌లో ఉన్న పాత నేరస్థులు ఇతర నేరాలు చేయకుండా నిరోధించ వచ్చని తెలిపారు. ఈ సందర్భంగా మంచి పనితీరును ప్రదర్శించిన ప్రత్యేక బృందాల అధికారులు, సిబ్బందికి రివార్డులు అందించారు.

- గత ఏడాది నుంచి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 1408 ఎన్‌బీడబ్ల్యూ కేసులను పరిష్కరించారు.
- దర్యాప్తులో నాన్‌బెయిలబుల్ వారెంట్‌లు పెండింగ్‌లో ఉన్న 52 మంది చనిపోయారని పోలీసులు నిర్ధారించారు.
- ఎన్‌బీడబ్ల్యూ పెండింగ్‌లో ఉన్న 14 మంది ఇతర కేసుల్లో జైలు శిక్షలు అనుభవిస్తున్నారు.
- 13 కేసుల్లో పరారీలో ఉన్న నేరస్థులకు జామీను(షూరిటీ) ఇచ్చిన వారికి నోటీసులు జారీ చేశారు.

కష్టపడి పనిచేసే కార్యకర్తలకే గుర్తింపు : మధుయాష్కీగౌడ్



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

హయత్‌నగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. శనివారం హయత్‌నగర్ త్యాగరాజనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ముఖ్య కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇచ్చే విషయాన్ని జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించినట్లు స్పష్టం చేశారు. నగరంలో నిర్వహించిన సామాజిక న్యాయ సమరభేరి సభను విజయవంతం చేసినందుకు ఆయన కార్యకర్తలను అభినందించారు. కార్యక్రమంలో వివిధ డివిజన్‌ల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలి

వనస్థలిపురం : పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. శనివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్‌కాలనీ బస్టాండ్‌లో శంశాక్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న 33 అడుగుల మట్టి విగ్రహ ప్రతిష్ఠ కర్రెపూజ కార్యక్రమానికి మధుయాష్కీగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ పల్లె కాశిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామారావు, సదాశివుడు పాల్గొన్నారు.

బాసర ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన కీర్తన

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): బాసర ట్రిబుల్ ఐటీకి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ జడ్పీహెచ్ఎస్‌లో పదవ తరగతి పూర్తిచేసిన మండలి కీర్తన అర్హత సాధించింది. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో 564 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ట్రిబుల్ ఐటీలో కీర్తన సీటు సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువుల్లో రాణించాలని ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి విద్యార్థికి సూచించారు.



విద్యార్థిని భూమికను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ రాంరెడ్డి

సీమ్స్ ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో భూమిక సత్తా

మన్సూరాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏడాది ప్రముఖ విద్యా సంస్థ అయిన సీమ్స్ ఒలింపియాడ్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో దండెంపల్లి భూమిక జాతీయస్థాయి మూడో ర్యాంకును సాధించి సత్తాచాటింది. సెయింట్ జాన్స్ పాఠశాలకు చెందిన భూమికతో పాటు ఆమె తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం శనివారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సూరం రాంరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మమతారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థిని భూమిక తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శేషాద్రినగర్‌కాలనీ అధ్యక్షుడిగా సోమయ్య

సరూర్‌నగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ 4వ డివిజన్‌లోని శేషాద్రినగర్ కాలనీ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం శనివారం ఇక్కడి ఓపెన్ పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన అధ్యక్షుడిగా సోమయ్య, గౌరవాధ్యక్షుడిగా రాజునాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా మిగతా కార్యవర్గాన్ని తదుపరి సమావేశంలో ఎన్నుకుంటామని అధ్యక్షుడు సోమయ్య తెలిపారు.

మార్కెట్ అభివృద్ధిలో హమాలీల పాత్ర కీలకం



నర్సింహారెడ్డిని సత్కరిస్తున్న హమాలీ సంఘం నాయకులు

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జాతీయ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిలో హమాలీల పాత్ర కీలకమని మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డి అన్నారు. మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం అఖిల హైదరాబాద్ హమాలీ సంఘం నాయకులు నర్సింహారెడ్డిని మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలు లేకుండా మార్కెట్‌లో క్రయవిక్రయాలు సాధ్యం కావన్నారు. శ్రామిక శక్తిలేకుండా ఏ రంగంలో మనుగడ సాధించలేమని ఆయన పేర్కొన్నారు. హమాలీల శ్రేయస్సు కోసం గుర్తింపు కార్డులు, లైసెన్సులు, యూనిఫాం త్వరలోనే అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ ఉద్యోగులు పుష్ప, మాధురి, జలజాక్షి, పవన్, కె.సురేష్, శేఖర్, రవీందర్, రాజు, మురళి, నర్సింగ్‌రావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఎస్ఐ సంతోష్‌కుమార్ బృందం

కొత్తపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే వేళ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఎస్ఐ సంతోష్, ఎస్ఐ నర్సింహారావు బృందం విద్యార్థులకు సూచించారు. శనివారం హయత్‌నగర్ పరిధిలోని 469మంది విద్యార్థులకు నిబంధనలపై అవగాహన కల్పించారు. కుంట్లూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, హయత్‌నగర్ పరిధిలోని టీజేఆర్ జూనియర్ కళాశాల, సీఎం హైస్కూల్, సిటీ మోడల్ స్కూల్, కేవీ గ్రూపు స్కూల్స్, కృష్ణవేణి స్కూల్స్‌లో వారు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు సక్రునాయక్, రాములుగౌడ్ తదితరులు

- మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రమావత్ సక్రునాయక్

వనస్థలిపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రమావత్ సక్రునాయక్ పిలుపునిచ్చారు. శనివారం వనస్థలిపురం డివిజన్ శక్తినగర్‌లో ఏఐటీయూసీ ఎల్బీనగర్ అధ్యక్షుడు బోయపల్లి రాములుగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రమావత్ సక్రు నాయక్ హాజరై మాట్లాడారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాల చట్టాల ప్రకారం రూ.25వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు అనసూయ, యాదమ్మ, సునీత, అలివేలు, నాగమ్మ పాల్గొన్నారు.

వలస కార్మికులు తరలిరావాలి

మన్సూరాబాద్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 9న చేపట్టదలచిన కార్మిక సమ్మెను వలస కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి కోరారు. ఈ మేరకు మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్‌లో శనివారం టీసీఐ ఫైట్ ఇండియా లిమిటెడ్ కంపెనీకి చెందిన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్, కీసరి నర్సిరెడ్డిలు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం ఏళ్లనాటి నుంచి ఉన్న కార్మిక చట్టాలను కాలరాసి వారిపొట్టనుకొట్టే నాలుగు లేబర్‌కోడ్లను తీసుకురావడం సరికాదన్నారు. సీఐటీయూ నాయకులు, టీసీఐ కంపెనీ కార్మికులు పాల్గొన్నారు.

రామచందర్‌రావు ప్రమాణ స్వీకారానికి తరలిన నేతలు

సైదాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు ప్రమాణస్వీకార కార్యక్రమానికి సైదాబాద్, కుర్మగూడ, అక్బర్‌బాగ్, ఐఎస్‌సదన్ డివిజన్ల నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ముందుగా రామచందర్‌రావు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నేతలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్తకాపు అరుణారవీందర్, జంగం శ్వేతారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



రామచందర్‌రావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

రామచందర్‌రావును కలిసిన లచ్చిరెడ్డి

వనస్థలిపురం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎన్.రామచందర్‌రావును బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతల సురేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రామచందర్‌రావును సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరిగౌడ్

రామచందర్‌రావుకు అభినందనలు

కొత్తపేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావును పార్టీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి నీరంకి రవి శాలువాతో సత్కరించారు. ఆయనకు తిరుపతి లడ్డూను అందజేసి అభినందనలు తెలిపారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రామచందర్‌రావును, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను రవి కలిశారు.

మహిళల భద్రతకు పెద్దపీట

- సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మహిళల భద్రత కోసం ఉమెన్ సేఫ్టీ వింగ్ నిరంతరం పనిచేస్తోందని సీపీ అవినాష్ మహంతి అన్నారు. వారం రోజుల వ్యవధిలో (జూన్ 29 నుంచి జూలై 5 వరకు) కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 154 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారు. మహిళలను, యువతులను వేధిస్తున్న వారిపై, ఆన్‌లైన్‌లో వేధింపులకు గురిచేస్తున్న వారిపై 57 కేసులు నమోదు చేశారు. మహిళల భద్రతపై ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో 85 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గృహహింసకు సంబంధించి మహిళా పోలీస్‌స్టేషన్‌లో 29 ఫిర్యాదులు రాగా వాటిలో 11 మందిపై కేసులు నమోదు చేశారు. మిగతా జంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ బృందం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో దాడులు చేసి వ్యభిచారం చేస్తున్న ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు 9 మంది యువతులను రక్షించారు. ఆపరేషన్ ముస్కాన్ 11లో భాగంగా 74 మంది చిన్నారులను కాపాడిన పోలీసులు, 69 మంది పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై 23 కేసులు నమోదు చేశారు. భరోసా సెంటర్‌లో కుటుంబ కలహాలతో వచ్చిన 31 జంటలకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఏవోసీ సెంటర్‌లో అగ్నివీరుల రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- ఈనెల 31 నుంచి సెప్టెంబర్ 14 వరకు నిర్వహణ

అల్వాల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అగ్నివీరుల రిక్రూట్‌మెంట్ ర్యాలీ తేదీలు ఖరారయ్యాయి. ఈనెల 31 నుంచి సెప్టెంబరు 14 వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు రక్షణశాఖ పౌరసంబంధాల అధికారి శివహరి నాయక్ తెలిపారు. సికింద్రాబాద్‌లోని ఏవోసీ సెంటర్ జోగిందర్‌సింగ్ స్టేడియంలో ఈ ర్యాలీలు జరగనున్నాయి. ఈ నియామకాల్లో భాగంగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ (జీడీ), అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వివిధ కేటగిరీల్లో అత్యుత్తమ క్రీడాకారులకు ప్రత్యేక స్పోర్ట్స్ ట్రయల్స్ కూడా ఉంటాయని అధికారులు చెప్పారు. ఇందుకోసం జూలై 31న ఉదయం 6గంటలకు జోగిందర్‌సింగ్ స్టేడియంలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. పలు అథ్లెటిక్స్ రంగాలలో జాతీయ లేదా అంతర్జాతీయ స్థాయి క్రీడా సర్టిఫికెట్లు అవసరమని తెలిపారు.



దత్తేశ్వరానంద భారతి మహాస్వామిని దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి నందిని

ముగిసిన వారాహి నవరాత్రులు

ఎల్బీనగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాళపీఠం ప్రత్యంగిరాదేవి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన వారాహి నవరాత్రి ఉత్సవాలు పూర్ణాహుతితో ముగిశాయి. సిద్ధేశ్వరిపీఠ ఉత్తర పీఠాధిపతులు దత్తేశ్వరానంద భారతి మహాస్వామి సమక్షంలో అమ్మవారికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. 18రకాల ద్రవ్యాలతో అభిషేకం, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు, మహానక్షత్ర హారతులు నిర్వహించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి నందిని, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద, యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారికి ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

శాకాంబరీదేవిగా అమ్మవారు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలోని లలిత భువనేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం అమ్మవారు శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి కుంకుమార్చనలు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కుకుట్లపల్లి మహేందర్ తెలిపారు. గుడికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను చేసినట్లు ఆయన తెలిపారు.

పోచమ్మ ఆలయంలో 20న బోనాలు

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌మలక్‌పేట పోచమ్మ ఆలయంలో ఈనెల 20న బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్, దేవాలయ ప్రతినిధి కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. బోనాల పండుగ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఓల్డ్‌మలక్‌పేటలోని పోచమ్మ ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పోచమ్మ ఆలయంలో బోనాల పండుగ ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 21న ఘటాల ఊరేగింపు, పోతురాజుల విన్యాసాలు ఉంటాయని స్థానిక ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు, మొక్కులు సమర్పించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మలక్‌పేట సేవాదళ్ అధ్యక్షుడు ఆకుల రాజు, రామకృష్ణ, ముప్పిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్‌కేపురం పార్క్‌లో వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న అనిల్‌కుమార్

ఎల్బీనగర్ : మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని ఆర్‌కేపురం డివిజన్‌లోని ఆర్‌కేపురం పార్కులో వీడీఆర్ ఫౌండేషన్ చైర్మన్ పున్న నిర్మల గణేష్‌నేత ఏర్పాటు చేయించిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్ టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు, టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్‌రెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్, సురేష్, ప్రసన్నాంజనేయస్వామి ఆలయ చైర్మన్ తలాటి రమేష్, గట్ల రవీంద్ర, రాజు నాయక్, ఎల్లయ్య, జ్ఞానేశ్వర్‌యాదవ్ పాల్గొన్నారు.